క్లుప్తంగా

రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ గాంధీపార్క్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏరియాలు, టీటీడీ కల్యాణ మండపం, గానుగ వీధి, పాండురంగస్వామి గుడి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

ప్రకాశం నగర్: దానవాయిపేట శాఖా గ్రంథాలయం, మహిళా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉపాధ్యాయుడు ఎం.సూర్యనారాయణ విద్యార్థులకు కథలు, తెలుగు పద్యాలు నేర్పించారు. క్రాఫ్ట్ టీచర్ వినోద్ పేపర్‌తో బొమ్మల తయారీలో శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయురాలు జ్యోతి స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు చంద్రపద్మాదేవి, పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా పృథ్వీ


పృథ్వీ

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ పృథ్వీ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని జిల్లా అరసం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు బుధవారం తెలిపారు. గుంటూరు కేంద్రంగా అన్నమయ్య గ్రంథాలయంలో జరిగిన సంఘం ఎన్నికలలో నగరానికి చెందిన పృథ్వీ రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఆయన గతంలో పలు హోదాల్లో పని చేశారన్నారు. అరసం జిల్లా కార్యదర్శి బీహెచ్‌వీ రమాదేవి అభినందనలు తెలిపారు.

త్వరలో ఇంటింటికీ బీజేపీ

కడియం: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించేందుకు త్వరలో ఇంటింటికీ బీజేపీ అనే కార్యక్రమం నిర్వహిస్తామని రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. కడియపులంకలో బుధవారం ఆ పార్టీ మండల సమావేశాన్ని అధ్యక్షుడు నాగులపల్లి వీరబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న మధుకర్, బొమ్ముల దత్తు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బీజేపీని ఆదరించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కాలేపు సాయిరాం, జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్ మాట్లాడారు.

స్వాగతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం కొవ్వూరులో జగనన్న విద్యాదీవెన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించారు.
– రాజమహేంద్రవరం సిటీ






ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎంపీ భరత్‌రామ్, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, ఏపీజీఎండీసీ చైర్మన్ చందన నాగేశ్వర్







సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి, రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి

భానుడి ప్రతాపం

- పెరుగుతున్న ఎండలు
- ప్రజల అవస్థలు

సీటీఆర్ఐ: ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపాన్ని ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. ఉదయం పది గంటల నుంచే ఎండ సుర్రుమనిపిస్తోంది. ప్రతి రోజూ సుమారు 40 నుంచి 45 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీనికి తోడు నుంచి రోహిణి కార్తె కూడా మొదలు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ మేలో అత్యధికంగా 49 డిగ్రీలు ఎండకాసింది. బుధవారం 40 డిగ్రీలు నమోదైంది.

పెరిగిన ఏసీల వాడకం

ఇప్పుడు ప్రతి ఇంటిలో ఏసీ వాడకం సాధారణంగా మారింది. బ్యాంకులు, ఏసీ కంపెనీలు డిస్కౌంట్‌లు ప్రకటించడంతో క్రెడిట్ కార్డులు,


ఎండలో వాహనచోదకుల ఇక్కట్లు

బ్యాంకు ఫైనాన్స్‌పై ఏసీలను కొనుగోలు చేసుకున్నారు. ఎండ నుంచి రక్షించుకోవడానికి ఏసీలపై ఆధారపడుతున్నారు. ప్రతి ఇంటిలోనూ ఏసీలు వాడడంతో విద్యుత్ వినియోగం అమాంతం


వై.జంక్షన్ వద్ద నిర్మానుష్యంగా మారిన రోడ్డు

పెరిగిపోయింది.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఎండల నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని నిపుణులు చెబుతున్నారు. తప్పనిసరి పరిస్థితి అయితే తప్ప బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నారు.

రోడ్లు నిర్మానుష్యం

ఎండల నేపథ్యంలో ఉదయం పది గంటల తర్వాత ప్రజల రాకపోకలు తగ్గిపోయాయి. మధ్యాహ్నం వేళలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం ఆరు గంటల తర్వాతే ప్రజలకు బయటకు వస్తున్నారు.

విహారానికి వచ్చి.. మృత్యు ఒడిలోకి

మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): ప్రకృతి ఒడిలో సరదాగా సేదా తీరుదామని వచ్చిన ఓ పర్యాటకురాలిని చెట్టుకొమ్మ రూపంలో మృత్యువు కబళించింది. ఆమె బంధువుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు విహార యాత్రకు మారేడుమిల్లి బయలుదేరారు. మార్గంలో రాజమహేంద్రవరంలో మరో మహిళతో కలిసి ఎనిమిది మంది బుధవారం మారేడుమిల్లి వచ్చారు. ఇక్కడ నుంచి జలతరంగిణి జలపాతం వద్దకు వెళ్లారు. సందర్శన అనంతరం అక్కడి నుంచి అమృతధార జలపాతానికి వెళ్లారు. వీరిలో రాజమహేంద్రవరానికి చెందిన ఎ.సంధ్య (38) జలపాతం పైభాగంలో బండరాళ్లపై కూర్చొని ఉంది. ఒక్కసారిగా భారీ చెట్టు కొమ్మ విరిగి ఆమెపై పడింది. దీంతో ఆమె కిందకు జారి బండరాళ్లపై పడిపోయింది. తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ రక్షణలో భాగస్వాములు కావాలి

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ దూడ ఆశారేఖ, అర్చన, మధుమోహన్ అన్నారు. హుకుంపేటలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల, పాఠశాల ఆవరణలో బుధవారం పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం–సంరక్షించడం అనే అంశంపై అవగాహన కల్పించారు. రాష్ట్ర సిల్వికల్చరిస్ట్ షేక్ సలాం ఆదేశాల మేరకు ప్రాంతీయ అటవీ పరిశోధనా సంస్థ రివిజనల్ ఫారెస్ట్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫారెస్టు బీట్ ఆఫీసర్లు మాట్లాడుతూ పర్యావరణం కాపాడడం అందరి బాధ్యత అని, వీలున్న చోట మొక్కలు నాటి పెంచాలన్నారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కాలుష్యం పెరుగుతోందని, తద్వారా అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఉమామహేశ్వరి, మల్లేశం పాల్గొన్నారు.



ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్లు

అన్నదానం మహాపుణ్యం

రాజమహేంద్రవరం సిటీ: పేదలకు అన్నదానం చేయడం మహాపుణ్యమని నగరపాలకసంసంస్థ డిప్యూటీ కమిషనర్ ఎం.సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ వద్ద స్వర్ణాంధ్ర సేవాసంస్థ ఆధ్వర్యంలో జరిగిన అన్నార్తుల వద్దకే అన్నదానం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పూర్వపు సహాయక సిటీ ప్లానర్ సీహెచ్ నారాయణరాజు కుమారుడు చింతలపాటి కాశీరాజు జ్ఞాపకార్థం సుమారు 500 మందికి అన్నదానం చేశారు. కార్పొరేషన్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, రుడా ప్లానింగ్ అధికారి ఎస్.శ్రీనివాస్, అడిషనల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సీహెచ్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు. అలాగే సీతానగరం, పుష్కర్ ఘాట్, స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం వద్ద సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు, లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు, మేనేజర్ కృష్ణ, కేర్ టేకర్స్ శ్రీనివాసరాజు, రాజేష్, షేక్ శ్రీను పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న డిప్యూటీ కమిషనర్ సాంబశివరావు

వైద్యశిబిరంలో పలువురికి సేవలు


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రామరాజు

రాజమహేంద్రవరం సిటీ: మదర్ థెరిసా మిలీనియం యూత్ వ్యవస్థాపకుడు, మాజీ కార్పొరేటర్, ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఐక్యవేదిక కన్వీనర్ అర్జరపు వాసు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కిమ్స్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బొల్లినేని రామరాజు అన్నారు. ఆ యూత్ ఆధ్వర్యంలో క్వారీ మార్కెట్ నుంచి లాలాచెరువు వెళ్లే రోడ్డులోని దానవాయిబాబు గుడి సమీపంలో బుధవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ రామరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్డియాలజీ, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, కంటి వైద్య నిపుణులు, చర్మవ్యాధుల నిపుణులు వైద్య సేవలు అందించారు. అలాగే బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

జాతీయస్థాయి పోటీల్లో రాణించాలి

ప్రకాశం నగర్: వాలీబాల్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్ ఆకాంక్షించారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలోని పరిమి రామచంద్రరావు మెమోరియల్ ఫ్లడ్‌లైట్స్ వాలీబాల్ కోర్టులో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ బాలుర శిక్షణ శిబిరాన్ని పరిశీలించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ ఈనెల 28న పశ్చిమబంగాల్‌లో జరిగే 45వ సబ్ జూనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కోరారు. కోచ్‌గా వ్యవహరిస్తున్న రాధాకృష్ణ, బాలాజీలకు అభినందనలు తెలిపారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

హైటెన్షన్


ఇళ్ల వద్ద చెట్ల మధ్య నుంచి వెళుతున్న విద్యుత్ తీగలు (అంతరచిత్రం) తీగలు నుంచి వస్తున్న మంట

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గాయత్రీ నగర్‌లో 33 కేవీ హైటెన్షన్ తీగలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇంటి పక్కన చెట్లు పెరిగిపోవడంతో, వాటిమధ్య వెళుతున్న తీగల నుంచి మంటలు రేగుతున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చెట్లుకొమ్మలను తొలగించి, మంటలు రాకుండా చూడాలని కోరుతున్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ప్రకాశం నగర్: స్థానిక సంపత్ నగర్‌లోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఏప్రిల్ 24 నుంచి ప్రారంభమైన ఈ తరగతుల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్ట్, క్రాఫ్ట్, వెస్ట్రన్ డ్యాన్స్, మ్యూజిక్, హార్స్ రైడింగ్, రైఫిల్ షూటింగ్, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్, హ్యాండ్ రైటింగ్, కరాటే, కిక్ బాక్సింగ్, ఆర్చరీ వంటి వంటి అనేక అంశాలలో శిక్షణ పొందారు. ముగింపు కార్యక్రమంలో తాము నేర్చుకున్న వివిధ అంశాలను ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ టి.స్వరూప్ రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఆ విద్యార్థులకు ప్రతిభా పత్రాలను అందజేశారు.

మహానాడు ఏర్పాట్ల పరిశీలన


వేమగిరిలో మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అచ్చెన్నాయుడు, బుచ్చయ్య చౌదరి

కడియం: వేమగిరిలో ఈనెల 27, 28వ తేదీల్లో జరగనున్న మహానాడు, ఎన్‌టీఆర్ శతజయంతి వేడుకల ఏర్పాట్లను బుధవారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆధ్వర్యంలో ఇప్పటివరకు 15 కమిటీలు వేశామన్నారు. మహానాడుకు పూర్తిస్థాయిలో బందోబస్తు ఇవ్వాలని ప్రభుత్వానికి, డీజీపీకి లేఖలు రాశామన్నారు. మహానాడుకు ప్రజలు లక్షలాదిగా తరలివస్తారన్నారు. పార్టీకి విరాళాలు ఇవ్వదలిచిన వ్యక్తులు మహానాడు రోజున ఇవ్వాలని కోరారు.

కొనసాగుతున్న శిక్షణ

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రత్యేక శిక్షణలో బుధవారం విద్యార్థులకు బేసిక్ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్‌పై అవగాహన కల్పించారు. ఈనెల 25వ తేదీ వరకూ జరిగే ఈ సమ్మర్ బూట్ క్యాంపులో 6 నుంచి 9వ తరగతికి చెందిన 25 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అనంతరం మధ్యాహ్నం మూడు రోజులుగా నేర్చుకున్న విషయాలపై విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు.